

# కల చెదిరింది

**గోపు భూపాల్, దిరిశాల ఏడుకొండలు**



**నా** మనసు గాల్లో తేలిపోతున్నట్లుగా ఉంది.

నిజంగా నా కెంతో సంతోషంగా ఉందీరోజు.

నా కెంతో ఇష్టమైన టీచర్ ఉద్యోగం.

అదీ అవు డెప్పుడో నా చిన్నప్పుడే మేము వదలి పెట్టి వచ్చిన మా స్వగ్రామంలో రావడం.

ఈ పట్నవాసపు కృత్రిమపు నవ్వులు. కల్మషాలు, కుతంత్రాలు ఇ వేవి లేని గోదావరి ఒడ్డునే ఉన్న చిన్న పల్లె మాది. నా ఉద్యోగ వార్త తెలిసి నప్పటినుంచి నా కాలు చేయి ఒక చోట నిల్వడం లేదు.

చిన్నపుడు తాతయ్య ఒళ్లో కూర్చోబెట్టుకొని పల్లె గురించి ఎన్ని కబుర్లు చెప్పే వాడో...

పరవళ్లు త్రొక్కే గోదావరి గురించి - కొబ్బరి చెట్ల గలగలల గురించి - దేవాలయం పూజారి రామనాథశాస్త్రి గురించి - పూజారి గారు

అష్టోత్తరం చదువుతూ ఉంటే ఎంత దూరం వినిపించేది - ఎంత మధురంగా ఉండేది - అన్ని కథలు కథలుగా చెప్పేవాడు.

తను అన్నీ శ్రద్ధగా వింటుండే వాడు. పూజారి గారు తాతయ్య కంటే చిన్న వారట. తాతయ్యని గౌరవంగా చూసే వా రట.

అప్పట్నుంచే ఎప్పటికైనా పల్లెకి చేరుకోవాలనే కోరిక కలిగింది. ఆ దిపుడు తీరబోతుంది. నాన్న కూడా ఎంతో సంతోషించే వాడు. తాతయ్య కదల లేని స్థితిలో ఉండబట్టేగాని లేకపోతే తనూ వస్తా ననే వాడే. అన లాయనకు తాము పట్నం రావడమే ఇష్టం లేదు. కాని నాన్నగారి ఉద్యోగ రీత్యా రాక తప్పలేదు. పల్లెలో తమకు స్థిరాస్తి అంటూ ఏమీ లేకపోవడంతో తాతయ్యతో సహా అందరూ పట్నం వచ్చారు.

"ఏం టోయ్! ఆలోచనలో పడిపోయావ్.ఇక అక్కడి కెళ్తే మేం గుర్తుంటామా?" జగన్, భుజం మీద చె య్యేసి అన్నాడు.

నేను నవ్వాను.

ప్లాట్ ఫాం రద్దీగా ఉంది. ఈ జనం వాళ్ల జీవిత కాలంలో చాలా భాగం ప్రయాణాల్లో గడుపుతుంటారేమో!

రైలు వస్తున్నట్లు అనౌన్స్ చేశారు. సూట్‌కేస్ చేత పట్టుకొని నిల్చున్నాను. రైలు వచ్చి ఆగింది.

చీమల పుట్టలోంచి చీమలు బయటకు వచ్చినట్లుగా చాలా మంది దిగారు. చిత్ర మేమిటంటే దిగిన వాళ్ల కంటే ఎక్కువగానే ఉన్నారు ఎక్కవలసిన వాళ్లు. ఎలాగో కష్టపడి ఎక్కాను. అదృష్టవశాత్తూ ఓ సీటు కనిపించింది ఖాళీగా. ఆలస్యం చేయకుండా అందులో కూర్చున్నాను.

రైలు కదిలింది. జగన్ చెయ్యి ఊపుతున్నాడు. నన్నటి కన్నీటి పొర అతడి కళ్లలో... నాకూ బా ధేసింది. ఎంత ఈ రెళ్లున్నా అతడిని విడచి వెళ్లాలంటే బాధగా ఉంది. చెయ్యి ఊపాను. బండి వేగం పుంజుకుంది.


దూరంగా కదిలే చెట్లని చూస్తుంటే చాల గమ్మత్తుగా ఉంటుంది.

*** *** ***

చిన్న కుదుపుతో రైలు ఆగింది. సూట్‌కేస్ తీసికొని ప్లాట్ ఫాం మీదకి అడుగు పెట్టాను. పెద్దగా జనం లేరు. స్టేషన్ బయటకి నడిచాను. తనకి పల్లె దారి కూడా తెలియదు. చుట్టూ చూశాను. ఓ మర్రి చెట్టు క్రింద అరుగు మీద ఓ వృద్ధుడు కూర్చుని ఉన్నాడు. ఏదో ఆలోచనలో ఉన్నాడేమో!

నొసట విభూతి, భుజం మీద శాలువా... పక్కనే ఉన్న సంచీలో ఏదో ఎర్ర అట్ట పుస్తకం కన్పిస్తోంది. దగ్గరకి వెళ్లి నమస్కరించి పల్లెకి దారి అడిగాను. ఆయన నా వైపు ఓ సారి చూసి, దూరంగా కనిపిస్తున్న కాలువ గట్టు చూపించి "ఆ కాలువ గట్టు వెంటే వెళ్లు బాబూ" అని చెప్పారు. నేను ఆయన దగ్గర సెలవు తీసికొని నడవసాగాను.

కాలువ గట్టు వెంట నడుస్తూ ఉంటే పిల్ల కాలువ శబ్దం ఓ మోహన రాగంలా విన్పిస్తోంది. కొబ్బరి చెట్ల 'ఝుం ఝుం' నాదాలు ప్రియుడి




చెవిలో రహస్యం చెప్పే ప్రేయసి గుసగుసల్లా ఉన్నాయి.

ఇలా కాలువ గట్టు మీద కొబ్బరి చెట్ల మధ్య నడవటం నిజంగా చాలా గొప్ప అనుభూతి.

దూరంగా పొలంలో ఓ భార్యా భర్తా కూర్చుని ఉన్నారు. ఆమె అన్నం ముద్దలు చేసి అతడి నోటికి అందిస్తూ ఉంది. వారిని చూస్తూ ఉంటే నండూరి వారి ఎంకి - నాయుడు బావల్లా ఉన్నారు.

ఓ స్త్రీ ఎదురు వచ్చింది, బహుశా పాలు తీసుకెళ్తుం దేమో పట్నానికి. ఆమె నన్ను దాటి పట్నం వైపుగా వెళ్లింది. వెనక్కి తిరిగి చూశాను. విశ్వనాథ, వారి కిన్నెరసాని గు ర్తొచ్చింది.

ఊరి దగ్గరకు వచ్చేశాను. ఊరి బయటే చెట్టు క్రింద ఉన్న అరుగు మీద చాలా మంది కూర్చుని పులిజూదం, చదరంగం లాంటి ఆటలు ఆడుతున్నారు. వాళ్లలో ఓ కతను నన్ను చూసి దగ్గర కొచ్చాడు 'ఏం కావాలి?' అన్నట్టు.

"దేవాలయం పూజారి రామనాథశాస్త్రి గారి ఇల్లు చూపించ గలరా" అడిగాను.

"నాతో రండి" అని అతడు ముందుకు దారి తీశాడు.

గుడిని సమీపిస్తుంటే గాలి అలల్లో నుంచి విన్పిస్తోంది ఓ స్త్రీ కంఠం "శ్రీ రాఘవం దశరథాత్మజ మప్రమేయం, సీతాపతిం రఘుకు లాన్వయ రత్న దీపం..."

అతడు గుడి దగ్గరకు వచ్చి వెనక్కి వెళ్లాడు. గుడి బయట ఉన్న ఓ రాతి మీద కూర్చున్నాను.

కొద్ది సేపటికి బయటకు వచ్చిం దామె.

'ఉంగరమ్ముల జుత్తు నొత్తి కట్టి, తెలుగు సింగారాలు తలంబ్రాలుగా జార పూలు ముడిచి ముద్దరాలు వోలె, నవ్వుల వెలార్చి -'

"ఎవరో వచ్చారు నాన్నా" వెనక్కి తిరిగి చెప్పిం దా అమ్మాయి. వెదురును మురళిగా మలచి వేణుగానం ఆలపించినట్లుగా....

గర్భ గుడిలోంచి ఆయన బయటికి వచ్చాడు.

"రామనాథశాస్త్రి గా రంటే మీరే క దండీ" అడిగాను.

"అవును" అన్నా డాయన.

పరిచయం చేసుకొని విషయం చెప్పాను. తాతయ్య పేరు వినగానే చాలా సంతోషం చాడాయన. నాతో ఆప్యాయంగా మాట్లాడసాగాడు.,

సూట్‌కేస్‌ని వాళింట్లో పెట్టమని ఆ అమ్మాయికి ఇచ్చి మే మిద్దరం స్కూలు వైపు బయలుదేరాము.

అక్కడికి వెళ్లి ప్రధానోపాధ్యాయుని కలిసి పరిచయం చేసుకున్నాను. స్కూలు వాతావరణం చాలా బాగుంది. ప్రధానోపాధ్యాయుడు నన్ను పిల్లలకి పరిచయం చేశారు.

ఆ రో జంతా రామనాథశాస్త్రి గారి ఇంట్లోనే గడిపాను.

సాయంత్రం ఆమెతో కలసి గోదావరి ఒడ్డు వైపు వెళ్లాను.

మా మాటల్లో విశ్వనాథ, బుచ్చిబాబు, దేవులపల్లి, కొడవగంటి, గోపీచంద్ నుండి యండమూరి, మల్లాది వరకు,

ఎందరో వచ్చారు.

గోదావరి ఒడ్డున కూర్చుని కబుర్లు చెప్తున్న ఆమెను చూస్తుంటే కాలమే తెలియదు.

ముఖ్యంగా ఆమె గొంతు గంగా తరంగ రమణీయ మధుర మంజుల వాణిలా....

"ఇంత సేపూ మాట్లాడుతూనే ఉన్నాం, మీ పేరు" అడిగాను.

"వరూధిని"

"వరూ...ధి...ని..." ఎంత మధురంగా ఉంది.

*** *** ***

రైలు కూత బిగ్గరగా వినిపించే సరికి వాస్తవంలోకి వచ్చాను.

"ఊహ ఎంత మధురమైనది."

కాఫీ, టీలు అమ్మే వాళ్లు, వేరు శనక్కాయలు అమ్మే వాళ్లతో స్టేషన్ అంతా గోల గోలగా ఉంది.

మెల్లగా రైలు ఆగింది. దిగి స్టేషన్ బయటకు నడిచాను.

స్టేషన్ బయట రాతి మీద ఒ కతను కత్తిలాంటి దేదో నూరుతున్నాడు. దగ్గరకి వెళ్లి 'పల్లె'కి దారి అడిగాను.

అతడు నా వైపు గుర్రుగా చూశాడు. ఆ చూపులో "నన్ను పలకరించడానికి నీ కెంత ధైర్యం" అన్న భావన ఉంది.

మళ్లీ ఒకసారి అడిగాను.

అతడు వినుక్కుంటున్నట్లుగా దూరంగా ఉన్న కాలువ గట్టు చూపించి అటుగా వెళ్ల మన్నాడు.

కాలువ గట్టు వెంట నడవసాగాను.

దూరంగా పొలంలో ఓ రైతు భోజనం తీసుకరావడం ఆలస్య మయిందనో ఏమో భార్యని తిడుతున్నాడు.

ఓ ముసలి స్త్రీ తల మీద బుట్ట పెట్టుకొని వస్తూ ఉంది. మోయలేక మోస్తున్నట్లుగా ఉంది ఆమెను చూస్తుంటే.

ఊరి దగ్గర కొచ్చాను. ఏదో కాలిపోయిన వాసన వస్తున్నట్లుగా ఉంది. అక్కడ కొంతమంది పే కాట ఆడుతూ కనిపించారు.

వాళ్లలో ఒ కతన్ని "రామనాథశాస్త్రి గారి ఇల్లెక్కడ" అని అడిగాను.

"ఆ గుడి దగ్గరే ఉంది వెళ్లు" అన్నాడు అతను తపో భంగం చెందిన ఋషిలా.

గుడి వైపుగా వెళ్లాను. గుడి అంతా పాడుబడినట్లుగా ఉంది. పూజా పునస్కారాలు కూడా జరుగుతున్నట్లు లేదు.

గుడి పక్కకి వచ్చి ఒక ఇంటి ముందు కూర్చుని ఉన్న అమ్మాయిని అడిగాను "రామనాథ శాస్త్రి గారి ఇల్లు ఇ దేనాండీ" అని.

"ఇ దేనండీ! రండి" అంటూ లోపలికి దారి తీసింది.

లోపలికి వెళ్లాను. గోడల నిండా సినిమా హీరోల బొమ్మలూ, క్రీడాకారుల చిత్ర పటాలు తగిలించి ఉన్నాయి.

"కూర్చోండి! నిల్చొనే ఉన్నా రేం" అం దామె కుర్చీ చూపిస్తూ.

"మీ నాన్న గారు."

"బయట కెళ్లారు. వస్తారు" చెప్పిం దామె.

"ఉంగ రమ్ముల జుత్తు నొత్తి కట్టి...." న వ్వొచ్చింది నాకు.

ఆ దేం డ్రస్సో అర్థం కాలేదు. స్త్రీలో ఉండాల్సిన సౌకుమార్యం లోపించి అసహజంగా ఉంది. స్త్రీకి, పురుషుడికి తేడా క్రమంగా అంతరిస్తున్నట్లుగా ఉంది, ఆమెను చూస్తుంటే.



## కార్బన్ కాపీ

ఒక మంత్రిగారు అలీన విధానం మీద 15 నిమిషాలకు సరిపోయే ఒక ఉపన్యాసం తయారు చేసి ఇమ్మని తన కార్యదర్శిని ఆదేశించారు. కార్యదర్శి ఖచ్చితంగా పదిహేను నిమిషాలకు సరిపోయేటట్టు ప్రసంగం రాసి టైప్ చేసి ఇచ్చారు. ఆ ప్రసంగాన్ని మంత్రిగారు సభలో చదవడానికి అరగంట పట్టింది. సభా నిర్వాహకులు తాము నిర్ణయించుకున్న కార్యక్రమం మంత్రిగారి అరగంట ప్రసంగంతో పాడయినందుకు హతాశులైపోయారు. ఆ విషయం గమనించిన మంత్రి గారు "ఏమయ్యా! సెక్రటరీ! పావుగంట ప్రసంగం తయారు చేసిఇమ్మంటే అరగంట ప్రసంగం ఇచ్చావేమయ్యా!" అన్నారు చిరాగ్గా. 'సార్, నేనిచ్చింది పావుగంట ప్రసంగమే, మీరు పొరపాటున కార్బన్ కాపీ కూడా చదివేశారు" అన్నాడు కార్యదర్శి.

ఈదువల్లి వెంకటేశ్వరరావు.
[ఏలూరు]

నన్ను నేను పరిచయం చేసుకొన్నాను. తరువాత మామూలుగా మాట్లాడుతూ కూర్చున్నాను. ఇంతలో రామనాథశాస్త్రి గారు వచ్చారు. ఆమె నా గురించి చెప్పింది. నే నూహించినంత ఆప్యాయత కనిపించలేదు ఆయన మాటల్లో.

మొక్కుబడిగా ఏదో కొంచెం సేపు మాట్లాడి ఆయన బజారు కెళ్లారు ఏదో ప నున్నట్లుగా.

తరువాత ఆమెతో చెప్పి అటు స్కూలు వైపుకు వెళ్లాను.

హెడ్మాష్టర్ గారు రూములో సర్పంచి గారితో ఏవో రాజకీయాలు మాట్లాడుతున్నారు. స్కూల్లో చదువుకొనే పిల్లలు చాలా తక్కువగా ఉన్నారు. కొంతమంది మాత్రం గోళీకాయలు ఆడుతూ కన్పించారు.

హెడ్మాష్టర్ దగ్గరి కెళ్లి కలిశాను. ఆయన నన్ను పట్టించుకొనే ధోరణిలో లేరు. ఆయన సుదీర్ఘ చర్చకు అంతరాయం కలిగించినట్లుగా చూసి రేపు వచ్చి జాయిన్ అవ్వ మన్నాడు.

నేను అక్కడ నుండి వెను దిరిగాను.

"కొత్తగా వచ్చిన పంతులా! పోయిన సారి వచ్చి నాయన కరణం గారి అమ్మాయిని లేపుకు పోయాడు. ఈయన ఎవరిని లేపుకు పోతాడో, వ్యగ్యంగా సర్పంచ్ అన్న మాటలకు హెడ్ మాస్టర్ గొల్లుమని నవ్వారు.

ఊళ్లో ఇళ్లు కూడా అక్క డక్కడ కాలిపోయి ఉన్నాయి. ఒ కతన్ని కారణం అడిగితే ఈ మధ్య కులాల పేరు మీద కొట్టుకుని ఒకరి ఇల్లు మరొకరు తగులబెట్టుకున్నారని చెప్పాడు.

టీ బంకులు, దుకాణాలు కాక ఒక సారాయి దుకాణం కూడా ఉన్నది. అక్కడ కూర్చొని చాలా మంది కుర్రకారు తాగుతున్నారు.

వారిలో....

ఆయన.....

రామనాథ శాస్త్రి కూడా....!!

*** *** ***

ఏం ఊహించుకొన్నాను? ఏం జరిగిం దిక్కడ? ఏరి? నండూరి వారి ఎంకి - నాయుడు బావ కనిపించరేం? ఎక్కడ విశ్వనాథుని కిన్నెరసాని? ఏది నే నూహించిన వరూధిని? ఎటు నుండి ఎటు పోతుంది మన సంస్కృతి? రాజకీయ నాయకులు తమ స్వార్థం కోసం రెచ్చగొట్టిన కుల రక్కసి కోరల్లో చిక్కుకుని తమ ఇళ్లనే మసి చేసుకొనే వీరు ఎటువైపు వెళ్తున్నారు?

నాగరి కతంటే ఇ దేనా?

అప్పటికీ ఇప్పటికీ మార్పు లేనిది...

ఒక్క గోదావరిలోనే నేమో!

